క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని అమ్డాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంగలి అంతయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో నూతనంగా కాంగ్రెస్ పార్టీ జెండాను ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకుందామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సామ రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ అంతయ్య, నాయకులు తొండుపల్లి శ్రీనివాస్, మద్యపాగ శ్రీనివాస్, సురేశ్, నర్సింహా, మధు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ

మొయినాబాద్‌రూరల్: గ్రామాల్లో పేదలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడంతో ఎంతో మేలు జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బొలిగిద్ద సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని తోల్‌కట్ట గ్రామంలో చర్చి బిషప్ కిష్టఫర్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. తోల్‌కట్ట గ్రామంలో బొలిగిద్ద లక్ష్మమ్మ, బొలిగిద్ద బాలరాజ్‌ల జ్ఞాపకార్థంగా హోప్ ఆఫ్ అండ్ ఆశ్రమం సంస్థ ద్వారా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, మహ్మద్ అమీద్‌ఖాన్, జంగయ్య, శంకరయ్య, శ్రీశైలం, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అరుంధతీ కాలనీ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం

తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ మన్నెగూడలోని అరుంధతీ కాలనీ నూతన కార్యవర్గాన్ని సోమవారం కాలనీలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జిమ్మి జాన్ కేఎం, కోశాధికారి జగదీష్, గౌరవ అధ్యక్షుడిగా మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నాగార్జున, జాయింట్ సెక్రటరీ రామ్మోహన్ రావు, సాంస్కృతిక కార్యదర్శి విజయలక్ష్మి, సలహాదారు శ్రీనివాస్‌రెడ్డి, కార్యనిర్వాహక సభ్యులు ఆర్. శ్రీనివాస్, అశోక్, నర్సింహ చారి, నారాయణ రెడ్డి, నాగభూషణం, శ్రీనివాసరావు, ఆదిత్య, నవీన్‌రెడ్డి, క్రిస్టోఫర్‌ను ఎన్నుకున్నారు.

రవిరాథోడ్‌కు సత్కారం

ఆమనగల్లు: రాష్ట్ర బీజేపీ ఎస్టీ మోర్చా సోషల్ మీడియా కన్వీనర్‌గా ఆమనగల్లుకు చెందిన రవిరాథోడ్‌ను నాగర్ కర్నూల్ జిల్లా బీజేపీ నాయకులు ఘనంగా సత్కరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన బీజేపీ సోషల్‌మీడియా సమావేశంలో రవిరాథోడ్‌ను వారు సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలకృష్ణ, నరేశ్, అంజన్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించండి

సీడీపీఓ వినితాదేవి

అబ్దుల్లాపూర్‌మెట్: గర్భిణులు, బాలింతలు పౌష్టికహారంపై అవగాహన కలిగి ఉండాలని సీడీపీఓ వినితాదేవి అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే పౌష్టికహార పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం పెద్దఅంబర్‌పేట అంగన్‌వాడీ కేంద్రం–3లో నిర్వహించిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడుతూ.. ఐసీడీఎస్ శాఖ ద్వారా అందించే పౌష్టికహారంపై సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించాలన్నారు. పక్షోత్సవాల్లో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కల్యాణి, టీచర్స్ నామిరెడ్డి నిర్మల, గిరిజ, ఉమా, వెంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎండ మండుతోంది!

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి
- నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు
- బయటకు వెళ్లాలంటేనే జంకుతున్న జనం



షాబాద్‌లో నిర్మానుష్యంగా ఉన్న రహదారి

షాబాద్: వేసవి కాలం ఆరంభంలోనే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఏప్రిల్ రాకముందే రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రజలు, వాహనాదారులు ఎండకు బయట తిరగలేకపోతున్నారు. ఉదయం 9 గంటలకే భానుడి భగభగలు మొదలవుతున్నాయి. ప్రతి నిత్యం రద్దీగా ఉండే ప్రధాన చౌరస్తాలు, వ్యాపార సముదాయాలు ఎండల తాకిడికి గిరాకీలు లేక వెలవెలబోతున్నాయి. ఉదయం 11 గంటలు దాటిందంటే రోడ్లపైకి జనం రావడానికి భయపడుతున్నారు. పనుల నిమిత్తం బయటకు వెళ్లాల్సి వస్తే ఉదయం, సాయంత్రం వేళలను ఎంచుకుంటున్నారు. ఇప్పుడే ఎండలు ఇలా ఉంటే ముందు ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వేసవి తాపం నుంచి కాపాడుకోవడానికి ఎక్కువగా కొబ్బరిబొండాలు, నిమ్మకాయ పానియాలు, లస్సీలు, పండ్ల రసాలు తాగి సేద తీర్చుకుంటున్నారు.

బయటకు వెళ్లలేకపోతున్నాం..



ఎండ తీవ్రంగా ఉంది. ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే భయంగా ఉంది. ఎండలో వెళ్తే వడదెబ్బకు తీవ్ర అస్వస్థతకు గురి అవుతున్నాం. మార్చి నెలలోనే ఇలా ఉంటే మే నెలలో ఎండలు ఏ విధంగా ఉంటాయో తలుచుకుంటేనే భయమేస్తోంది.

– జాకీర్‌షరీఫ్, పోతుగల్, షాబాద్ మండలం

ఫీజుల నియంత్రణకు డిమాండ్



మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

చేవెళ్ల: అధిక ఫీజులు వసూలు చేస్తూ పేద విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజేశ్ అన్నారు. చేవెళ్ల మండలంలోని అంబేడ్కర్ భవనంలో సోమవారం చేవెళ్ల డివిజన్ పీడీఎస్‌యూ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకుడు మాట్లాడుతూ.. నారాయణ, శ్రీచైతన్య లాంటి కార్పొరేట్ విద్యాసంస్థలు, ప్రైవేట్ విద్యాసంస్థలు వివిధ రకాల ఫీజుల పేరుతో విద్యార్థుల నుంచి అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై అనేక సార్లు జిల్లా విద్యాశాఖ దృష్టికి తీసుకెళ్లినా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతోపాటు నిద్రమత్తులో ప్రైవేట్ విద్యాసంస్థలకు వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతూ పాఠశాలల్లోనే పుస్తకాలు, యూనిఫామ్‌లు అమ్ముతున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఫీజులు నియంత్రించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎన్.అంజన్‌కుమార్‌గౌడ్ పీడీఎస్‌యూ కేలండర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు జైపాల్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ఉపాధ్యాక్షుడు సురేశ్, సహాయ కార్యదర్శి అశోక్ తదితరులు ఉన్నారు.

ఘనంగా వివేకానంద కళాశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు మంచి లక్ష్యాన్ని ఎంచుకొని సాధనకు నిరంతరం కృషి చేయాలని వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సంస్కృతీ కార్యక్రమాలు అందరిని ఎంతో అలరించాయి. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. విద్యార్థి జీవితంలో డిగ్రీ విద్య అనేది ఎంతో ప్రధానమైందన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకొని సాధనకు నిరంతరం శ్రమించాలన్నారు. తద్వారా మంచి ఫలితాలు సాధించగలుగుతారన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ విజయ్‌కుమార్, సత్యనారాయణ, కరుణాకర్ రెడ్డి, విశ్వనాథం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

16 వరకు లోక్ అదాలత్

ఎస్‌ఐ శ్రీకాంత్

తలకొండపల్లి: 'రాజీ మార్గమే రాజ మార్గ'మని ఎస్‌ఐ శ్రీకాంత్ అన్నారు. చిన్న చిన్న తగాదాలు, క్షణికావేశంలో జరిగిన గొడవలు, అహంకార పూరితమైన కక్ష్య సాధింపు కొట్లాటలు తదితర నేరాలను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. ఈనెల 16 వరకు ఆమనగల్లు కోర్టులో లోక్ అదాలత్ ఉంటుందని, ఆ లోగా తమ కేసులను రాజీ చేసుకోవాలని ప్రజలకు ఎస్‌ఐ సూచించారు.

నేడు క్రీడాపోటీలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో మంగళవారం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో 18 నుంచి 30 సంవత్సరాల్లోపు ఉన్న యువతీ యువకులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో రన్నింగ్ పోటీలు, స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో వాలీబాల్, ఖోఖో, క్యారమ్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న వారు పోటీల్లో పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు.

మీసేవ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

తహసీల్దార్ అయ్యప్ప

యాచారం: మీసేవ నిర్వాహకులు నింబంధనల ప్రకారం ప్రజలకు సేవలు అందించాలని యాచారం తహసీల్దార్ అయ్యప్ప సూచించారు. మండల కేంద్రంలో ఉన్న మీసేవ కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. ప్రభుత్వానికి సంబంధించిన మెజార్టీ సేవలకు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందని అన్నారు. అందువల్ల నిర్వాహకులు జాగ్రత్తగా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారమే సేవలకు ఫీజులు వసూల్ చేయడంతో పాటు ప్రతి సర్వీస్‌కు రసీదులు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో యాచారం మీసేవ కేంద్రం నిర్వాహకుడు మహేష్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లికి చెందిన ప్రమోద్ కూతురు తన్విశ్రీ(2) గుండె సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందింది. విషయం తెలియడంతో విఠాయిపల్లిలో సోమవారం తన్విశ్రీ కుటుంబ సభ్యులను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, శేఖర్, సుమన్ నాయక్, ప్రశాంత్, తిరుమలేశ్, మహేశ్, నరేశ్ తదితరులు ఉన్నారు.

'రంజాన్'కు సదుపాయాలు కల్పించాలి

పీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్‌ను కలిసిన ముస్లిం నాయకులు



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న నాయకులు

షాద్‌నగర్: రంజాన్ మాసంలో ముస్లింలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని పీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్ కోరారు. సోమవారం పలువురు ముస్లిం నాయకులు మున్సిపల్ కమిషనర్ వెంకన్నను కలిసి ఈ విషయంపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబర్‌ఖాన్ మాట్లాడుతూ.. ముస్లింలకు అత్యంత పవిత్రమైన మాసం రంజాన్ అన్నారు. మున్సిపల్ అధికారులు మసీదుల వద్ద శామినాయాలు, నీటి వసతి, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశుద్ధ్య సిబ్బందిని అదనంగా నియమించాలని, ముస్లింలు అత్యధికంగా నివాసం ఉండే కాలనీల్లో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రాత్రి వేళల్లో దుకాణాలు ఎక్కువ సేపు నడిపించుకోవడానికి అనుమతించాలని, ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారులకు ఇబ్బందులు కలిగించొద్దని పోలీసులను, లేబర్ అధికారులను కోరారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో నాయకులు చెంది తిరుపతిరెడ్డి, రఘు, ముబారక్, ఖదీర్, ఫయాజ్, పాషా, జాఫర్, లయాఖ్, జోహెబ్, తదితరులు ఉన్నారు.

జెడ్పీహెచ్‌ఎస్‌లో వాటర్‌ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సిరాజుద్దీన్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ బడుల అభివృద్ధికి దాతలు సహరించాలని విర్బాక్ యానిమల్ హెల్త్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ ఆర్ఎం సిరాజుద్దీన్ కోరారు. ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌లో గల జెడ్పీహెచ్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఆ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. హెచ్ఎం రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మంచినీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతుండేవారన్నారు. బోరు నీరు తాగే విద్యార్థులకు సిరాజుద్దీన్ అండగా నిలవడం గర్వకారణమన్నారు. స్థానికంగా ఉండే మరో దాత లింగల్ల భాస్కర్ వాటర్ ప్లాంట్ గది నిర్మాణానికి రూ.20 వేలు విరాళం ప్రకటించారని తెలిపారు. కార్యక్రమంలో శివకుమార్‌రెడ్డి, ఏరియా మేనేజర్ డాక్టర్ సురేందర్, రవీందర్, భాస్కర్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల భవనాన్ని పూర్తిచేయండి

ఎమ్మెల్యే మల్‌రెడ్డికి ఎన్‌ఎస్‌యూఐ నేతల వినతి



ఎమ్మెల్యే మల్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నేతలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని వినోబానగర్‌లో నిర్మిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు నందకిషోర్ సోమవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. నందకిషోర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారని.. ప్రస్తుతం నిర్మాణ పనులను నిలిపివేశారని తెలిపారు. పనులు పూర్తిచేసి డిగ్రీ తరగతులు ఈ విద్యా సంవత్సరంలో కొత్త భవనంలో ప్రారంభం అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి.. పనులు ఎందుకు నిలిచిపోయాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ విద్యాసంవత్సరంలోనే భవనం అందుబాటులోకి వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న వెంకటేశ్‌గుప్తా

జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశ్‌గుప్తా

షాద్‌నగర్: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరు వెంకటేశ్ గుప్తా అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో బూత్ కమిటీలతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. పదేళ్లలో దేశం అన్ని రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు. దేశంలో బలమైన ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రపంచ దేశాలు భారత్ వైపు చూసే విధంగా చేసిన ఘనత ప్రధాని మోదీకి దక్కుతుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు సాధించి మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు ప్రజలను మభ్య పెట్టేందుకు మాయమాటలు చెబుతున్నారన్నారు. వాటిని ప్రజలు విశ్వసించడం లేదన్నారు. మంగళవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో రాష్ట్రస్థాయి బూత్ కమిటీల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు, ఈ సమావేశానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా విచ్చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు, బూత్ కమిటీల అధ్యక్షులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు పిట్టల సురేశ్, రఘుగౌడ్, వెంకటేశ్, మధుసూదన్‌గౌడ్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావ్యతిరేక విధానాలతో మోసం'



బూత్ ఏజెంట్లతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

షాద్‌నగర్: బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని, ఆ విధానాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ బూత్‌స్థాయి ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించాలన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, ఆ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంకర్ తదితరులు

నందిగామ: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని వెంకమ్మగూడలో గల శ్రీ మల్లికార్జునస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన శివ పార్వతుల కల్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు ప్రతియేటా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. సుమారు వారం రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహించడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రియాంక, మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్, ఎంపీటీసీలు కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గౌడ్, నాయకులు మధు, కృష్ణ, రాంరెడ్డి, బుచ్చయ్య, శ్రీశైలం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

కేశంపేట: మండల పరిధిలోని కాకునూర్ గ్రామ శివారులో గల శ్రీమహాలింగేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు భజన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి స్థానంలో శ్రీవీరభద్ర భజన మండలి మందాపురం, వనపర్తి జిల్లా (15,116), రెండో స్థానంలో శ్రీ ఉమామహేశ్వర భజన మండలి వనపర్తి, వనపర్తి జిల్లా (11,116), మూడో స్థానంలో శ్రీ అభయాంజనేయ భజన మండలి కేశంపేట గ్రామం, రంగారెడ్డి జిల్లా, నాలుగో స్థానంలో శ్రీ అమృతలింగేశ్వర భజన మండలి లేమామిడి గ్రామం, రంగారెడ్డి జిల్లా, ఐదో స్థానంలో శ్రీ వేంకటేశ్వర భజన మండలి నిర్దవెల్లి గ్రామం, రంగారెడ్డి జిల్లా, ఆరో స్థానంలో శ్రీ మహాలింగేశ్వర భజన మండలి, కాకునూర్ గ్రామం, రంగారెడ్డి జిల్లాలు గెలుపొందాయి. వీరిలో పాటు శ్రీరాములు, విజయరెడ్డిలకు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా ద్రోణాచారి వ్యవహరించారు. గెలుపొందిన వారికి సోమవారం శ్రీనివాస్‌గౌడ్ నగదు బహుమతులు అందజేశారు.

బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలి

ఎస్‌బీఐ ఎదుట సీపీఎం నేతల నిరసన

తుర్కయంజాల్: ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే బహిర్గతం చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించినా కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మొండి వైఖరి సరైంది కాదని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి భాస్కర్ తెలిపారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తుర్కయంజాల్‌లోని ఎస్‌బీఐ కార్యాలయం ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సామేల్, జగదీష్, జిల్లా కమిటీ సభ్యులు జగన్, నర్సింహ, అలంపల్లి నర్సింహ, రవికుమార్, మున్సిపాలిటీ కన్వీనర్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

బహిర్గతం చేయాలి..

మంచాల: ఎస్‌బీఐ బాండ్ల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు యాదయ్య అన్నారు. సోమవారం మంచాల మండల పరిధిలోని ఆరుట్ల ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాలను తప్పక పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి శ్యాంసుందర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బుగ్గరాములు, రాజు, స్వామి, గోపాల్, రవి, వెంకటేశ్, పాండు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.